# గురుకులాలు పిలుస్తున్నాయ్

## 5వతరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు

- జనవరి 6వరకు గడువు.. ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష
- గత కేసీఆర్ ప్రభుత్వం కృషితో కార్పొరేట్ స్థాయిలో గురుకులాలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 7,200 అడ్మిషన్లకు అవకాశం


మునుగోడులోని బాలికల గురుకుల విద్యార్థినులు

మునుగోడు, డిసెంబర్ 25 : ప్రతి నిరుపేద కుటుంబానికి నాణ్యమైన ఆంగ్లవిద్య అందించాలనే గొప్ప సంకల్పంతో గత కేసీఆర్ ప్రభుత్వం గురుకుల పాఠశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఇటీవల ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలల్లో ఆడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ విడుదలైంది. ఇందు కోసం ఉమ్మడి ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థులకు ఆడ్మిషన్లు కల్పిస్తారు. 5వ తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు.

### ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 90 గురుకులాలు..

రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 90 గురుకుల పాఠశాలలను నిర్వహిస్తున్నది. ఒక్కో పాఠశాలలో 5వ తరగతి నుంచి పదో తరగతి వరకు 480 చొప్పున సుమారు 43,200 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. బీసీ సంక్షేమ శాఖ-32, సాంఘిక సంక్షేమ శాఖ-26, గిరిజన సంక్షేమ శాఖ-15, మైనార్టీ శాఖ-13, టీఎస్ విద్యాశాఖ-4 చొప్పున మొత్తం 90 గురుకులాలు ఉండగా.. ఒక్కో పాఠశాలలో 5వ తరగతిలో 80 సీట్లు ఉంటాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 90 గురుకులాల్లో 7,200 మంది విద్యార్థులు ఉమ్మడి ప్రవేశ పరీక్ష ద్వారా అడ్మిషన్లు పొందనున్నారు.

### కావాల్సినవి..

- పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, విద్యార్థి సంతకం
- విద్యార్థి బోనఫైడ్
- వివరాలను అప్‌లోడ్ చేసే ముందు జాగ్రత్తగా పరిశీలించుకోవాల్సి ఉంటుంది
- ఈ నెల 18 నుంచి జనవరి 6 వరకు ఆన్‌లైన్‌లో రూ.100 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి
- ఉమ్మడి జిల్లాలోనే పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తారు
- ప్రవేశ పరీక్షలో వచ్చిన ప్రతిభ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది

### ప్రవేశానికి అర్హతలు..

- 2023-24 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వీరు ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్నట్లుగా ధ్రువీకరణ ప్రతం(బోనఫైడ్)ను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.
- 1.09.2011 నుంచి 31.8.2015 లోపల జన్మించి ఉండాలి,(9నుంచి13 సంవత్సరాల్లోపు విద్యార్థులు మాత్రమే)
- వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2లక్షలు ఉండాలి.

### ప్రవేశ పరీక్ష ఇలా..

- ఫ్రిబవరి11న ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహిస్తారు
- తెలుగు, ఇంగ్లిష్, గణితం, మెంటల్ ఎబిలిటీ(మానిసిక సామర్థ్యం), పరిసరాల విజ్ఞానంలో 3, 4 తరగతి స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి.
- మొత్తం 100 మార్కులకు అబ్జెక్టివ్ టైప్‌లో పరీక్ష ఉంటుంది
- తెలుగు-20, ఇంగ్లిష్-25, పరిసరాల విజ్ఞానం-20, మెంటల్ ఎబిలిటీ-10 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి.
- ఓఎంఆర్ షీట్‌లో జవాబులు గుర్తించాలి
- పరీక్షా పత్రం తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ఉంటుంది

### వైబ్‌సెట్లు..

-http;//tswreis.ac.in
http;//tgtwgurukulam,telangana.gov.in
http;//mjptbewreis.telangna.gov.in

# అర్హులందరికీ బీమా.. బ్యాంక్ అకౌంట్

- ఊరూరా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర
- ప్రత్యేక వాహనాలతో పల్లెపల్లెనా ప్రచారం..
- వివిధ స్కీమ్‌లు అందించే లక్ష్యంగా డిసెంబర్ 16న ప్రారంభమైన యాత్ర
- రేపటితో ముగియనున్న ప్రచారం


గ్రామాల్లో తిరిగే ప్రచార వాహనాలు

**ప్రస్తుత ప్రపంచంలో భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశాల జాబితాలో ఉండగా 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మార్చు కోసం కేంద్ర ప్రభుత్వం వికాసిత్ భారత్ సంకల్ప యాత్ర పేరిట అనేక కార్యక్రమాలు చేపడుతున్నది. అందులో భాగంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడం, బ్యాంక్ అక్కౌంట్‌తోపాటు బీమా కలిగి ఉండడం, అర్హులైన ప్రతి కుటుంబానికి ఉజ్వల గ్యాస్ కనెక్షన్ తోపాటు ఆధార్ అనుసంధానం తదితర కార్యక్రమాలు చేపడుతున్నది. ఇందుకుగానూ సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ప్రచారం చేపట్టేందుకు ప్రత్యేకంగా ఆరు వాహనాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 16న జిల్లాలో ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా ఆయా బ్యాంకుల సిబ్బంది గ్రామాలకు వెళ్లి ప్రచారం చేస్తున్నారు. అధికారికంగా రేపటితో ఈ కార్యక్రమం ముగియనుండగా, అవసరమైతే మరో రెండు, మూడ్రోజులపాటు కొనసాగించనున్నట్లు ఎల్‌డీఎం బాపూజీ తెలిపారు.**

–సూర్యాపేట, డిసెంబర్ 25
(నమస్తే తెలంగాణ)

ప్రజలకు సాగు, తాగునీటితోపాటు రహదారులు తదితర మౌలిక సదుపాయాల కల్పనతో భారతదేశం నేడు అభివృద్ధి చెందుతున్న దేశాల జాబితాలో ఉంది. అయితే 2047 నాటికి దేశం అభివృద్ధి చెందిన దేశంగా అవతరించే లక్ష్యంతో ప్రతి సంక్షేమ పథకం అర్హులకు అందాలన్న ఉద్దేశంతో 18 నుంచి 50 ఏండ్లు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ బ్యాంక్ అక్కౌంట్ కలిగి ఉండడం, అలాగే రూ.20లతో 2 లక్షల ప్రమాద బీమా, రూ.436లతో సాధారణ మరణం సంభవించినా బీమా కల్పించే స్కీమ్‌లో చేర్పించడం, అర్హులైన వారందరికీ ఉజ్వల గ్యాస్ కనెక్షన్ ఇప్పించాలని కేంద్రం చర్యలు చేపడుతున్నది. అలాగే ఆయుష్మాన్ భారత్, పీఎం పోషణ్ అభియాన్ తదితర పథకాలపై ప్రజలకు అవగాహన ఉండాల్సి ఉంది. ఇందుకుగానూ కేంద్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు వికాసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా బ్యాంకుల భాగస్వామ్యంతో మేధావులతో ప్రచారం నిర్వహిస్తున్నది.

### జిల్లా వ్యాప్తంగా ప్రచారం..

జిల్లాలోని 475 గ్రామ పంచాయతీల్లో ఈ నెల 16న ప్రత్యేక వాహనాలతో ప్రచారాలు ప్రారంభమయ్యాయి. మొత్తం ఆరు ప్రచార వాహనాలు ఏర్పాటు చేయగా ఒక్కో వాహనంతో ఆయా ప్రాంతాల బ్యాంకులకు చెందిన ఇద్దరు ఉద్యోగుల చొప్పున ఆరు వాహనాల వెంట మొత్తం 12 మంది ఉంటున్నారు. ఉదయం 12, సాయంత్రం 12 గ్రామాల చొప్పున రోజుకు 24 గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. అయితే చిన్న పంచాయతీలు ఉన్నచోట రోజుకు 30 నుంచి 35 గ్రామాలు పూర్తి చేస్తున్నారు. గ్రామాల్లో సెంటర్ వద్ద వాహనాలు నిలిపి బ్యాంక్ అధికారులతో పాటు మేధావులు, ఇతర ఉద్యోగులతోపాటు గ్రామస్తులను ఆహ్వానించి వారికి సంక్షేమ పథకాలపై వివరిస్తున్నారు. గ్రామాల్లోనే అక్కౌంట్లు లేని వారిని గుర్తించి అక్కౌంట్లు ఇప్పించడం, వారికి బీమా విలువలు తెలియజేస్తూ బీమా కల్పించడం, అర్హులైన కుటుంబాలకు ఉజ్వల గ్యాస్‌తోపాటు ఇతర అన్ని సంక్షేమ పథకాలను కల్పిస్తున్నారు. ఇప్పటికే దాదాపు 70 శాతం గ్రామాలు పూర్తి కాగా రేపటితో అధికారికంగా గడువు ముగియనుందని, అవసరమైతే మరో రెండు రోజులు కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.

### ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలో ప్రత్యేక వాహనాల ద్వారా ప్రచారం చేస్తున్నాం. ప్రజలు సద్వినియోగం చేసుకుంటూ సంక్షేమ పథకాలు పొందాలి. వాహనాలు తిరిగే సమయంలోనే కాకుండా మామూలుగా ఆయా ప్రాంతాల్లోని బ్యాంకులను సంప్రదించి సంక్షేమ పథకాల వివరాలు తెలుసుకోవచ్చు. ఇప్పటి వరకు జిల్లాలో 70 శాతం పంచాయతీల్లో ప్రచారాలు పూర్తయ్యాయి. రేపటితో గడువు ముగుస్తుండగా దాదాపు వంద శాతం గ్రామాలు పూర్తవుతాయి. ఒకవేళ మరి కొన్ని గ్రామాలు మిగిలి ఉంటే రెండు, మూడ్రోజులు పొడిగిస్తాం.

–సీహెచ్ బాపూజీ, లీడ్ బ్యాంక్ మేనేజర్



# వందేండ్ల వసంతం

## చిరకాలం.. గుర్తిండిపోయేలా..

### ఉల్లాసంగా.. ఉత్సాహంగా.. హెచ్‌పీఎస్ కార్నివాల్

**హెచ్‌పీఎస్ శతాబ్ది ఉత్సవాలు చిరకాలం గుర్తిండిపోయేలా కొనసాగుతున్నాయి. ఈ వేడుకల్లో ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పాల్గొని తాము చదువుకున్న పాఠశాలలో, గడిపిన మధురానుభూతులను సన్నిహితులతో పంచుకుంటూ సరదాగా గడుపుతున్నారు. సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 8గంటల వరకు నిర్వహించిన కార్నివాల్‌లో స్టేజీ షో, వింటేజ్ కార్ షో, యూత్ పార్లమెంట్, బుక్ రీడింగ్ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.**

– సిటీబ్యూరో, డిసెంబర్ 25(నమస్తే తెలంగాణ)

